క్లుప్తంగా

ఆర్బీకేలో రికార్డుల పరిశీలన

పెద్దారవీడు: మండలంలోని పుచ్చకాయలపల్లె రైతు భరోసా కేంద్రంలో రికార్డులను వ్యవసా యాధికారి కె.బుజ్జిబాయి శనివారం పరిశీలించారు. పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయని రైతులతో ఈకేవైసీ వేయించారు. ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ చేయని రైతులకు 14వ విడత డబ్బులు అకౌంట్లలో పడవని, రైతులు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. విఏఏ లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో దరఖాస్తుల ఆహ్వానం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 40, 7వ తరగతిలో 7, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 2, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. 85007 23716 నంబరును సంప్రదించాలన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో శనివారం రైతు భరోసా కేంద్రం వద్ద పశు వైద్యాధికారి డి.దేవారెడ్డినాయక్ ఆధ్వర్యంలో సిబ్బంది సుమారు 650 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. దేవారెడ్డి నాయక్ మాట్లాడుతూ పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధితో పశువులకు విపరీతమైన జ్వరం, నోటి పుండ్లు, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడి మేత మేయక బలహీనంగా అవుతాయన్నారు. పాలు ఇచ్చే గేదెలకు పాల దిగుబడి తగ్గుతుందని దేవారెడ్డి నాయక్ తెలిపారు.

కొనకనమిట్లలో..

కొనకనమిట్ల: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ముందస్తు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టామని గొట్లగట్టు పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం వెంగళపల్లి, నలనూతలలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ పశుపోషకులు తమ పశువులకు వ్యాధి రాలేదని అశ్రద్ధ చేయకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని కోరారు. టీకాల కార్యక్రమం ఏప్రిల్ 24వ తేదీవరకు వేస్తామన్నారు. సిబ్బంది బరిగె శ్రీనివాసులు, ఇమ్మానియేలు, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయం

తాళ్లూరు: తళ్లపు రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రి అందిస్తూ చేయూత ఇవ్వడం అభినందనీయమని వక్తలు అన్నారు. తాళ్లూరు కస్తూరిబా, ఏబీసీ, వీకే ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శనివారం పరీక్షల సామగ్రి అందించారు. ట్రస్ట్ చైర్మన్ టి. ప్రశాంతరెడ్డి, కో ఫౌండర్ టి.శివశంకర్‌రెడ్డిలు పాల్గొని విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేషాబాబు, ప్రిన్సిపాల్ సుజిత పాల్గొన్నారు.

అడవులపై అవగాహన ఉండాలి

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు అడవులపై అవగాహన ఉండాలని డిప్యూటీ రేంజి ఆఫీసర్ బాలాజీ నాయక్ అన్నారు. గిద్దలూరు రేంజి ఆఫీసర్ కుమార్‌రాజా ఆదేశాల మేరకు అడవులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సంజీవరాయుడుపేటలో సెయింట్ జాన్ స్కూల్ విద్యార్థులకు బోదిబీటు ప్రాంతంలో నేచర్ క్యాంప్ నిర్వహించారు. అడవులతో ప్రయోజనాలు అటవీశాఖ అధికారులు విద్యార్థులకు వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని వివరించారు. అటవీ శాఖ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, అంకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

తాళ్లూరు: తూర్పుగంగవరం టౌన్ ఫీడర్ పరిధిలో చెట్లు తొలగించడంతో పాటు మరమ్మతుల కోసం ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని ఏఈ వీరబ్రహ్మం కోరారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, గమనించి వినియోగదారులు ముదస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎంఎస్‌ఎంఈ చైర్మన్‌కు అభినందన

మార్కాపురం: ఆంధ్రప్రదేశ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) సూక్ష్మ చిన్న మధ్య తరహ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన విశాఖ డైయిరీ చైర్మన్, అడారి ఆనంద కుమార్‌ను మార్కాపురం పట్టణానికి చెందిన ఆ సంస్థ స్టేట్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్ శనివారం అభినందించారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని అభినందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలు వచ్చాయని ఇండస్ట్రీయల్ పరంగా రాష్ట్రం ముందుకు వెళ్తుందని బద్రీనాథ్ అన్నారు. నూతన పరిశ్రమలు వస్తున్నందు వల్ల యువతకు భారీ స్థాయిలో ఉద్యోగాలు వస్తాయన్నారు.

గుంటి గంగలో ప్రభ ఏర్పాటుకు సన్నాహాలు



ర్యాలీగా బయల్దేరిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



గుంటి గంగలో జెండా పాతుతున్న బూచేపల్లి యూత్

తాళ్లూరు: శివరామపురం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గుంటి గంగా భవాని తిరునాళ్లలో ప్రభ ఏర్పాటుకు మాజీ సర్పంచి నిశంకం హనుమంతరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు శనివారం గుంటి గంగా భవాని ప్రాంతంలో స్థలాన్ని ఎంపిక చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ర్యాలీగా బయల్దేరి తాళ్లూరు, కొత్తపాలెం, మాధవరం, తూర్పుగంగవరం మీదుగా గుంటి గంగా భవాని అమ్మవారి క్షేత్రానికి చేరుకుని పూజలు చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, వెన్నపూస వెంకారెడ్డిల ఆధ్వర్యంలో జెండా పాతారు. ముందుగా శివరామపురంలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో..

తాళ్లూరు: గుంటి గంగా భవాని తిరునాళ్లకు శివరామపురం వైఎస్సార్ సీపీ బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ ఏర్పాటుకు శనివారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచి బొడ్డు రాములు, సుబ్బారావు, ఆలోకం హరిబాబు, మన్నం వేణు, వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి బ్రహ్మయ్య, శీలం వెంకటరెడ్డి, కాశిరెడ్డి, వీరాంజనేయరెడ్డి, అనపర్తి కృపయ్య, గుమ్మడి శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి జెండా పాతారు.

గుంటి గంగ హుండీ ఆదాయం లెక్కింపు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని ఆలయ హుండీని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. మూడు నెలల పది రోజులకు రూ.2,00,948 ఆదాయం వచ్చినట్లు ఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఆర్‌ఏ కోట శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు చలువాది శింగయ్య, గురుబ్రహ్మ, యాడిక యలమందారెడ్డి, ప్రభాకర్, దేవదానం, ఎస్.శ్రీను పాల్గొన్నారు. తరునాళ్ల సందర్భంగా టెంకాయల అమ్మకానికి, కొబ్బరి చిప్పల పోగు చేసుకునే హక్కు కోసం వేలం పాట శనివారం నిర్వహించారు. టెంకాయల అమ్మకానికి చీమకుర్తికి చెందిన గాలెం ధనలక్ష్మి రూ.2.75 లక్షలకు, కొబ్బరి చిప్పల ప్రోగుకు శింగరకొండకు



గుంటి గంగ వద్ద నిర్వహిస్తున్న వేలంపాట

చెందిన ఎర్రగొర్ల శ్రీనివాసరావు రూ.39,500 వేలకు వేలం పాటలో హక్కు దక్కించుకున్నారు. గత సంవత్సరం రూ.3.48 లక్షలకు వేలం పాటలో హక్కులు పొందగా ఈ సంవత్సరం రూ.3.14 లక్షలు మాత్రమే దక్కింది.

సుపరిపాలన కొనసాగింపే లక్ష్యం

- ప్రజల అండదండలే వైఎస్సార్ సీపీ పునాదులు
- పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి
- ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా గృహసారథులు
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పుల్లలచెరువు: సుపరిపాలన కొనసాగింపే లక్ష్యంగా సమష్టి కృషి చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక రైస్ మిల్ వద్ద శనివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోందన్నారు. సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసేవలో జగనన్నకు తోడుగా ఉండాలని మంత్రి సురేష్ పిలుపునిచ్చారు. ప్రజలకు జగనన్న చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని టీడీపీ చూసి ఓర్వ లేకపోతోందన్నారు. ఈ నెల 7 నుంచి జరిగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో విజయవంతం చేయాలన్నారు. ప్రజల అండదండలే వైఎస్సార్ సీపీకి పునాదులన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గం పరిధిలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుడదని, తన సొంత నిధులతో సమస్యను పరిష్కారిస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం కన్వీనర్లకు మా నమ్మకం నువ్వే స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్‌లు కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు రమణారెడ్డి, రాములు, వెంకటయ్య, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జానికీ రఘు, గడ్డం సుబ్బయ్య, సుబ్బారెడ్డి, కాశయ్య పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ పనులు పునః ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శనివారం మోక్షం లభించింది. కొన్నేళ్లుగా పనులకు నోచుకోని భవన నిర్మాణ పనులకు మంత్రి ఆదిమూలపు సురేష్ చొరవతో గ్రీన్ సిగ్నల్ లభించింది. కొత్త కాంట్రాక్టర్‌తో పనులను ప్రారంభించేందుకు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ నాసరరెడ్డి, డీఈఈ, సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్మా మల్లేష్, జోగి వెంకట నారాయణ, అల్లు రాంభూపాల్‌రెడ్డి, అల్లు ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

5న కృత్రిమ అవయవాల క్యాంపు

పొదిలి రూరల్: ఈ నెల 5న మార్కాపురం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే ఉచిత కృత్రిమ అవయవాల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం పొదిలి మండలంలోని పొదిలి పట్టణంతో పాటు కాటూరివారిపాలెం, మాదాలవారిపాలెం, అక్కచెరువు, మల్లవరం, పోతవరం, కంభాలపాడులో ప్రచారం నిర్వహించారు. ఎంపీడీఓ పి. శ్రీకృష్ణ, ఏపీఎం మాణిక్యరావు, ఎస్సై మల్లికార్జునరావును కలిశారు. దేవళ్ల ఆంజనేయులు, బత్తిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవునికి శాంతి కల్యాణం



ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవ రావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలే

ముండ్లమూరు: ప్రజలకు ఇబ్బంది కలిగేలా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలుశిక్ష తప్పదని ఎస్‌ఐ సంపత్‌కుమార్ హెచ్చరించారు. మండలానికి చెందిన నలుగురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని శనివారం దర్శి కోర్టుకు హాజరు పరచగా మెజిస్ట్రేట్ వారికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 నగదు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న షంషేర్ అలీబేగ్

మార్కాపురం: స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న గ్లోబల్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం కళాశాల చైర్మన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్ ప్రారంభించారు. జార్జ్ ఇంజినీరింగ్ కళాశాల, కిట్స్ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన కిట్స్ కళాశాల టీం 8 ఓవర్లలో 58 పరుగులు చేయగా, జార్జీ కళాశాల 6 ఓవర్లలోనే 58 పరుగులు చేసి విజేతగా నిలిచింది. కాగా ఇండియాలోనే ప్రఖ్యాత మోటివేటర్ బీఆర్ షఫీ శనివారం సాయంత్రం కళాశాల్లో జరిగిన కార్యక్రమంలో చేసిన ప్రసంగం విద్యార్థులను ఆలోచింపజేసింది. లక్ష్య సాధనకు, వ్యక్తిత్వానికి, విద్యా వికాసానికి షఫీ చేసిన సూచనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ షంషేర్ అలీబేగ్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్ శ్రీధర్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ రఫీ పాల్గొన్నారు.

మనిషిలో పరివర్తన కలిగించేది రంజాన్



మాట్లాడుతున్న రఫీక్

కంభం: మనిషిలో పరివర్తన కలిగించే మాసం రంజాన్.. అని జమాతే ఇస్లామిహింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీక్ అన్నారు. స్థానిక ఏబీ ఫంక్షన్ హాల్లో శనివారం జమాతే ఇస్లామిహింద్ ఆధ్వర్యంలో రంజాన్ శుభాలు అన్న అంశంపై సమావేశం, ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఫీక్ మాట్లాడుతూ ఉపవాసాల ముఖ్య ఉద్దేశం మానవుల్లో దైవం పట్ల భయభక్తులు జనింపజేయడమేనన్నారు. ఇతరులకు ఉపకారం చేస్తే మనసుకు తృప్తి కలుగుతుందని, మనం ఎల్లవేళలా సేవా ధృక్పథం కలిగి ఉండాలని, తద్వారా జీవితం సార్థకమవుతుందన్నారు. జమాఅతే ఇస్లామిహింద్ గత 75 సంవత్సరాల నుంచి సామాజిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను కులమతాలకు అతీతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌస్ ఖాన్, రాష్ట్ర సలహామండలి సభ్యుడు అష్రఫ్ అలీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖదీర్, రఫీ, అల్తాఫ్, పట్టణంలోని ముస్లింలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించండి



మంత్రి సురేష్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మార్కాపురం: ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కోరారు. శనివారం మార్కాపురంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్దకు వచ్చి వినతి పత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణకు మాదిగ రాజకీయ పెద్దలు మేధావులు ముందుకు వచ్చి తమ వంతు పాత్రలను పోషించి వర్గీకరణ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణ సాధించిన రోజే.. జాతీయ అమర వీరులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. కొంతమంది స్వార్థపరులు వర్గీకరణను సుప్రీం కోర్టులో, పార్లమెంట్‌లో అడ్డుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారని, ఇటువంటి పరిస్థితుల్లో వర్గీకరణ సాధించుకునేందుకు ముందుకు రావాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

జగన్ చెప్పారంటే.. చేస్తారంతే!



మాట్లాడుతున్న మద్దిశెట్టి శ్రీధర్

దర్శి: ఎన్నికల హామీలు 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వారధిలా, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశం గర్వపడేలా ప్రజాసంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్నన్న నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు వివరించాలన్నారు. గృహసారథులు వారికి అందజేసిన సామగ్రిలోని బ్యాడ్జిలు ధరించి వారి వలంటీర్ పరిధిలోని ఇళ్లకు జగనన్న ప్రతినిధులుగా వెళ్లాలన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న.. అని ముద్రించిన కరపత్రాలతో గత ప్రభుత్వంలో చంద్రబాబు ఏం చేశారో, ఇప్పటి మన జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు ఏం మేలు చేస్తున్నామో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కురిచేడు: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వస్త్రాంనాయక్ తెలిపారు. మొత్తం 558 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

గిద్దలూరు రూరల్: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ నరసింహారావు తెలిపారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ముండ్లమూరు: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చంద్రమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మార్కాపురం టౌన్: ఈ నెల 3 నుంచి జరిగే 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ రాందాస్ నాయక్ తెలిపారు. మార్కాపురం పట్టణ, మండల పరిధిలో 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని 2,089 మంది పరీక్షలు రాయనున్నారని చెప్పారు.

మార్కాపురానికి ఖ్యాతి తేవాలి



విద్యార్థులతో యాదవ్, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి

మార్కాపురం: విద్యార్థులు పది పరీక్ష ఫలితాల్లో మార్కాపురానికి రాష్ట్ర స్థాయిలో పేరు తేవాలని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, అఖిల భారత యాదవ మహ సభ క్రమశిక్షణ సంఘ అధ్యక్షుడు పీఎల్‌పీ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ అందించారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా ఏకాగ్రతతో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు. హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జి.ఎల్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుచరిత కుమారి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పెదారికట్ల, చినారికట్లలో గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసే పథకాలపై అవగాహన కలిపించారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, షమీమ్, కనకదుర్గ, అంజలి, కోటేశ్వరి, అరుణ, సరస్వతి, సావిత్రి, ఏఎన్‌ఎం ధనలక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం



పట్టు వస్త్రాలు తెస్తున్న ఉభయదాతలు

కొనకనమిట్ల: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొట్లగట్టు గ్రామంలో శనివారం సాయంత్రం నిర్వహించిన రాములోరి రథోత్సవం కన్నుల పండువలా సాగింది. వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ, శేఖరశర్మల మంత్రోచ్ఛరణల మధ్య మేళతాళాలతో, భజన బృందాలతో గొట్లగట్టు పురవీధుల్లో రథాన్ని లాగుతుండగా భక్తులు విరివిగా పాల్గొని తిలకించారు. మహిళలు పోటీలు పడి రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, చీతిరాల మాలకొండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు పులిహోరా అందజేశారు. అనంతరం గ్రామంలో వసంతోత్సవం, దొంగల దోపిడీ నిర్వహించారు.



ఉత్సవంలో స్వామి వారు

సంక్షిప్తంగా

చలివేంద్రం ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మండల పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, నాయకుడు గుమ్మా యల్లేష్ శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి శ్రీశైలం పుణ్య క్షేత్రంతో పాటు సుదూర ప్రయాణాలు చేసే యాత్రికులు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండల పాస్టర్స్ యూనియన్ అధ్యక్షుడు సింగా రాజేష్, గౌరవ అధ్యక్షుడు యలకపాటి ఇస్రాయేల్, సింగా యేసుదానం, బుట్టి దిలీప్‌కుమార్, కొండెపోగు డేవిడ్‌రాజు, పూర్ణకంటి జేమ్స్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సిరి

తాళ్లూరు: చిరుధాన్యాల సాగు, వినియోగంతోనే సిరులు ఉంటాయని సీడీపీఓ సీహెచ్ భారతి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు చిరుధాన్యాల సాగు చాలా లాభదాయకమని, ప్రతి అంగన్‌వాడీ టీచర్ చిరు ధాన్యాలను సాగు చేసి వినియోగిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేశారు. చిరుధాన్యాలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ్ లోగో ఆకర్షణీయంగా నిలిచింది. ఏసీడీపీఓ అంజమ్మ, సూపర్‌వైజర్లు జ్యోతి, సునీత, హేమలత, అనూరాధ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

5న దివ్యాంగులకు ఉచిత క్యాంపు

పొదిలి: మార్కాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 5న వైఎస్సాఆర్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాలరెడ్డి కోరారు. శనివారం మండల, పట్టణ అధ్యక్షులు బత్తిన నరసింహారావు, దేవళ్ల ఆంజనేయులతో కలిసి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీకృష్ణను కలిసి సహకారం అందించాలని కోరారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు సహకారంతో కృత్రిమ అవయవాల పంపిణీ చేస్తారని తెలిపారు.

పొదిలి సీఐగా రాఘవేంద్ర



రాఘవేంద్ర

పొదిలి: మండల కేంద్రం పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాఘవేంద్ర శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్ బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానంలో రాఘవేంద్ర ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతలు సక్రమంగా నిర్వహించటంతో పాటు, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల ఎస్సైలు మల్లిఖార్జున, సుధాకర్, దీపికలు రాఘవేంద్రను కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగాలకు ఇద్దరు ఎంపిక



ఖాదర్‌వలీ

మార్కాపురం టౌన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) వారు శనివారం ప్రకటించిన ఫలితాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన దూదేకుల ఖాదర్‌వలీ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో, కె. నవతేజ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని ఎస్‌బీఐ ఉద్యోగి కాశీరెడ్డితో పాటు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ అభినందించారు. ఖాదర్‌వలీ తండ్రి కాశీంవలీ తాపి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఉద్యోగం రావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.